ప్రజాశక్తి

ఆదివారం 11 ఫిబ్రవరి, 2024

పి.వికి భారతరత్నపై కృష్ణదాస్ హర్షం

ప్రజాశక్తి- పోలాకి

ప్రపంచంలోనే ఆర్థికంగా బలమైన దేశంగా భారత్‌ను రూపొందించడంలో మాజీ ప్రధానమంత్రి కీర్తిశేషులు పి.వి.నరసింహారావు తన చివరి శ్వాస వరకు శ్రమించారని, వైసిపి జిల్లా అధ్యక్షులు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. పివికి దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రకటించడంపై ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పివి వేసిన ఆర్థిక సంస్కరణల పునాదుల ఫలంగానే ప్రస్తుతం భారతదేశం ప్రపంచంలోనే ఆర్థికంగా నాలుగో బలవంతమైన దేశంగా రూపుదిద్దుకుందన్నారు. గొప్ప రాజనీతిజ్ఞుడు, బహుభాషా కోవిదుడు పివికి భారతరత్న దక్కడం తెలుగు ప్రజలందరికీ గర్వకారణంగా భావిస్తున్నామన్నారు.

నేటి నుంచి 'శంఖారావం'

ఇచ్ఛాపురంలో సిద్ధమైన సభావేదిక

- ఇచ్ఛాపురంలో ప్రారంభం
- జిల్లాలో నాలుగు రోజుల పాటు సాగనున్న లోకేష్ పర్యటన
- తొలి రోజు మూడు నియోజవర్గాల్లో సభలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన పార్టీ నాయకత్వం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి

రానున్న ఎన్నికలకు పార్టీ కేడర్‌ను సమయాత్తం చేసేందుకు యువతనేత లోకేష్ చేపట్టనున్న శంఖారావం యాత్ర ఆదివారం ఇచ్ఛాపురంలో ప్రారంభం కానుంది. తొలిరోజు మూడు నియోజవర్గాల్లో సాగనుంది. యాత్రలో భాగంగా నియోజకవర్గ కేంద్రాల్లో సభలు నిర్వహించనున్నారు. దీంతో పాటు నియోజకవర్గాల వారిగా కేడర్‌తో ముఖాముఖి, కేడర్‌కు సూపర్-6 కిట్ల అందజేత వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నారు. లోకేష్ యాత్రకు సంబంధించి పార్టీ నాయకత్వం ఇప్పటికే అన్నిరకాల ఏర్పాట్లు చేసింది. తొలి రోజు బహిరంగసభ నిర్వహించనున్న స్థానిక సురంగి రాజా క్రీడా మైదానాన్ని ఎమ్మెల్యే బెందాళం అశోక్ శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో వెంట కాళ్ల ధర్మారావు, నందిక జాని, సాలీనా ఢిల్లీ యాదవ్, ఆసి చిరంజీవిరెడ్డి, కోటి, లీలారాణి, పద్మనాభం, జయదేవ్, జానకీరావు పాల్గొన్నారు. పలాసలో కుంబిరిగాం కూడలి వద్ద నిర్వహించనున్న శంఖారావం సభాస్థలిని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పరిశీలించారు. పీరుకట్ల విఠల్‌రావు, దువ్వాడ హేమబాబు చౌదిరి, కుత్తుమ లక్ష్మణరావు, తలగాన నర్సింహవ సర్తి, దువ్వాడ సంతోష్ ఉన్నారు. టెక్కలి నియోజకవర్గానికి సంబంధించి స్థానిక మెళియాపుట్టి కూడలి నిర్వహించనున్న సభాస్థలిని రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు పరిశీలించారు. నాయకులు బగాది శేషగిరి, జీరు భీమారావు, పినకాన ఆజయ్‌కుమార్, మహిళా ఆధ్యక్షులు మెండ దమయంతి, హనుమంతు రామకృష్ణ, చాపర గణపతి, పోలాకి షణ్ముఖరావు, కొళ్ల లవకుమార్, గండి చంద్రరావు, పినకాన జోగారావు, దల్లి ప్రసాద్‌రెడ్డి, రెయ్యి ప్రీతీష్‌చంద్, కొళ్ల కామేష్, మల్లిపెద్ది మధు ఉన్నారు. టెక్కలిలో శంఖారావం సభాస్థలాన్ని డిఎస్‌పి బాలచంద్రారెడ్డి పరిశీలించారు. సమావేశం జరగనున్న స్థలంలో వాహనాల ఆనుమతి, రాకపోకల కట్టడి చేయడంలో తీసుకోవాల్సిన చర్యలతో పాటు, పోలీసులు తీసుకోవాల్సిన చర్యలపై కిందిస్థాయి అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశారు. పాత జాతీయ రహదారి పక్క ఉన్న స్థలంలో సమావేశం జరగనున్న దృష్ట్యా ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సూచించారు. ఈయనతో పాటు సిఐలు చంద్రమౌళి, పైడయ్య, ఎస్ఐ లక్ష్మి ఉన్నారు.

టెక్కలి : మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

విజయవంతం చేయాలి

శ్రీకాకుళం అర్బన్ : ఈ ఐదేళ్లలో సిఎం జగన్మోహన్‌రెడ్డి అరాచక పాలన కొనసాగిస్తూ రూ.లక్షల కోట్లు కొల్లగొట్టారని, నాటి అరాచక పాలనను అంతమొందించేందుకు, ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు టిడిపి జాతీయ ప్రదాన కార్యదర్శి నారా లోకేష్ శంఖారావం పూరించనున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. నగరంలోని టిడిపి కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఆదివారం ఇచ్ఛాపురం నియోజక వర్గం నుంచి యాత్ర ప్రారంభమవుతుందని అన్నారు. యువగళం పాదయాత్రలో పర్యటించని నియోజకవర్గాల్లో శంఖారావం యాత్ర సాగుతందన్నారు. నిరుద్యోగంతో యువత, ధరల పెరుగుదలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పార్టీ ఉపాధ్యక్షులు పి.ఎం.జె.బాబు, బొణిగి భాస్కరరావు, నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, ఎస్.వి.రమణ మాదిగ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంలో ఉదయం

10.30 : ఇచ్ఛాపురం రాజావారి గ్రౌండ్స్ శంఖారావం కార్యక్రమానికి శ్రీకారం.
10.40 : బాబు షూరిటీ - భవిష్యత్‌కు గ్యారంటీ, మన టిడిపి యాప్‌లో ప్రతిభకనబర్చిన 50 మంది కార్యకర్తలకు లోకేష్ అభినందన
10.50 : ఇచ్ఛాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే బెందాళం అశోక్ ప్రసంగం
10.55 : శంఖారావం సభలో నారా లోకేష్ ప్రసంగం
11.15 : ఇచ్ఛాపురం నియోజకవర్గ పార్టీ కేడర్‌తో ముఖాముఖి
11.25 : పార్టీ కేడర్‌కు లోకేష్ చేతుల మీదుగా సూపర్-6 కిట్ల అందజేత
11.28 : పార్టీ కేడర్‌తో ప్రతిజ్ఞ చేయించనున్న లోకేష్
11.29 : పార్టీ కేడర్‌తో లోకేష్ సెల్ఫీ కార్యక్రమం
12.30 : పలాస నియోజకవర్గానికి చేరిక
12.30 : పలాస మండలం కేదారిపురం కంబిరిగాం కూడలి వద్ద భోజన విరామం

పలాసలో మధ్యాహ్నం

2.30 : బాబు షూరిటీ - భవిష్యత్‌కు గ్యారంటీ, మన టిడిపి యాప్‌లో ప్రతిభ కనబర్చిన 50మంది కార్యకర్తలకు అభినందన
2.50 : పలాస నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గౌతు శిరీష ప్రసంగం
2.55 : లోకేష్ ప్రసంగం
3.15 : పలాస నియోజకవర్గ పార్టీ కేడర్‌తో ముఖాముఖి
3.25 : పార్టీ కేడర్‌కు లోకేష్ చేతులమీదుగా సూపర్ - 6 కిట్ల అందజేత
3.28 : పార్టీ కేడర్‌తో ప్రతిజ్ఞ చేయించనున్న లోకేష్
3.29 : పార్టీ కేడర్ లోకేష్ సెల్ఫీ
4.10 : లోకేష్ టెక్కలి చేరిక

టెక్కలిలో సాయంత్రం

5.00 : బాబు షూరిటీ - భవిష్యత్‌కు గ్యారంటీ, మన టిడిపి యాప్‌లో ప్రతిభకనబర్చిన 50 మంది కార్యకర్తలకు లోకేష్ అభినందన
5.20 : టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అచ్చెన్నాయుడు ప్రసంగం
5.25 : నారా లోకేష్ ప్రసంగం.
5.45 : టెక్కలి నియోజకవర్గ పార్టీ కేడర్‌తో ముఖాముఖి
5.55 : పార్టీ కేడర్‌కు సూపర్- 6 కిట్లు అందజేత
5.58 : పార్టీ కేడర్‌తో చేయినున్న ప్రతిజ్ఞ
5.59 : పార్టీ కేడర్‌తో సెల్ఫీ
6.45 : నరసన్నపేట నియోజకవర్గం జమ్ము చేరిక
7.00 : నరసన్నపేట పరిధిలోని జమ్ము గ్రామ శివారులో బస

విసిలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ఓటర్ల జాబితా నవీకరణలో అప్రమత్తం

వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఓటర్ల జాబితా తుది పబ్లికేషన్ తర్వాత చేర్పులు, మార్పులు ఇతర సవరణల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా సూచించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితా నవీకరణ తదితర అంశాలపై అదనపు సిఇఒలు పి.కోటేశ్వరరావు, ఎం.ఎన్.హరీంధర్‌ప్రసాద్‌లతో కలిసి శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ జిల్లాకు సంబంధించిన ఎన్నికల సంసిద్ధత ప్రణాళికను వివరించారు. పెండింగ్‌లో ఉన్న సుమారు 17 వేల దరఖాస్తులను రోజు వారి పర్యవేక్షణ చేస్తున్నామని అన్నారు. ఎన్నికల విధులకు అవసరమయ్యే సిబ్బందిని నియమించడానికి శాఖల వారీ ఉద్యోగుల డేటాఎంట్రీ పూర్తి చేసినట్లు చెప్పారు. ఎన్నికల బందోబస్తు, రవాణా వాహనాలు, రూట్ మ్యాప్‌లో తదితర అంశాలను ఇప్పటికే పూర్తి చేశామన్నారు. సిబ్బందికి తుది దశ ఎన్నికల శిక్షణ ఇవ్వాల్సి ఉందన్నారు. జిల్లాలో 597 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఆయా గ్రామాల్లో తీసుకోవాల్సిన చర్యలను కమిషన్ దృష్టికి తీసుకొచ్చామని చెప్పారు. సమావేశంలో జెసి ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, ఇన్‌ఛార్జి డిఆర్ఒ జె.వి.ఎస్.రామ్మోహనరావు, ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య, ఉప కలెక్టర్ పద్మావతి, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, జిల్లా పరిషత్ సిఇఒ వెంకటేశ్వరరావు, సిపిఒ లక్ష్మీప్రసాదన్న, సి-సెక్షన్ డిటి చక్రవర్తి పాల్గొన్నారు.

నీటిఎద్దడి నివారణకు చర్యలు

జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

మాట్లాడుతున్న చైర్‌పర్సన్ విజయ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రానున్న వేసవిలో జిల్లాలో తాగునీటి కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ ఆదేశించారు. జెడ్‌పి సమావేశ మందిరంలో ఆమె అధ్యక్షతన శనివారం స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో గ్రామీణ నీటి సరఫరా విభాగంపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న వేసవి కారణంగా ప్రజలకు ఎటువంటి తాగునీటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇటీవల ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి ప్రారంభించిన ఉద్దానం ప్రాజెక్టు పరిధిలో అందిస్తున్న తాగునీరు నిరాటంకంగా సరఫరా చేయాలన్నారు. విద్యాశాఖను సమీక్షిస్తూ జిల్లాలో నాడు-నేడు కింద పాఠశాలల రూపురేఖలు మార్చివేసిందన్నారు. ప్రతి పాఠశాలలోనూ కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ఫర్నిచర్, ఇతర ఎన్నో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశామని అన్నారు. రాత్రి వేళల్లో వాటిని సంరక్షించాల్సిన బాధ్యతను దృష్టిలో ఉంచుకుని పాఠశాలల్లో వాచ్‌మెన్లను నియమించేందుకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. 6వ స్థాయీ సంఘ సమావేశానికి అధ్యక్షత వహించిన సిరిపురపు జగన్మోహనరావు ఎస్‌సి. కార్పొరేషన్, సాంఘిక సంక్షేమం, బిసి సంక్షేమం, బిసి కార్పొరేషన్ వికలాంగులు, నెడ్‌క్యాప్ తదితర శాఖల ప్రగతిని సమీక్షించారు. 3వ స్థాయీ సంఘ సమావేశంలో పశుసంవర్ధక, వ్యవసాయ, మత్స్య, పట్టుపరిశ్రమ, అటవీ, ఉద్యానవన, వ్యవసాయ మార్కెటింగ్ తదితర శాఖలకు చెందిన ప్రగతిపై సమీక్షించారు. 5వ స్థాయీ సంఘ సమావేశానికి అధ్యక్షత వహించిన జంపు కన్నతల్లి మహిళా, శిశు అభివృద్ధి, వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్ శాఖల పనితీరును, ప్రగతిని సమీక్షించారు. సమావేశాలల్లో జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సిఇఒ ఆర్,వెంకట్రామన్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై లోకేష్ చర్చకు సిద్ధమా!

- మూలపేట పోర్టు, కిడ్నీ రీసెర్చ్ సెంటర్ అభివృద్ధికి మచ్చుతునక
- మంత్రి అప్పలరాజు

మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పలాస నియోజకవర్గం, రాష్ట్రంలో వైసిపి పాలనలో జరుగుతున్న అభివృద్ధిపై నారా లోకేష్ చర్చకు సిద్ధమా? పశుసంవర్థకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సవాల్ విసిరారు. రూ.45 లక్షల వ్యయంతో నిర్మించిన పల్లివూరు సచివాలయం భవనాలను శనివారం ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ మామిడి భాస్కరరావు అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తిత్లీ తుపాను సమయంలో నియోజకవర్గంలో చంద్రబాబు తిష్టవేసి దత్తత తీసుకుంటామని చెప్పారు. ఇదేనా దత్తత తీసుకోవడడమా అని ప్రశ్నించారు. టిడిపి ప్రభుత్వంలో నియోజకవర్గానికి చేసిన ఒక్క అభివృద్ధి చెప్పగలరా ప్రశ్నించారు. శంఖారావం పేరుతో నియోజకవర్గంలో పర్యటిస్తున్న లోకేష్ పలాసలో సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించిన కిడ్నీ రీసెర్చ్ ఆస్పత్రి వద్ద ఆగి చూస్తే మా అభివృద్ధి కనిపిస్తుందని అన్నారు. రూ.700 కోట్లతో ఇంటింటికీ తాగునీరు అందించే శుద్ధిజల ప్రాజెక్టు చూస్తే మా అభివృద్ధి ఏమిటో తెలుస్తుందని అన్నారు. టెక్కలిలో పర్యటించే ముందు మూలపేటలో శరవేగంగా జరుగుతున్న పోర్టు పనులు చూడాలని సూచించారు. అభివృద్ధిపై బహిరంగ లేఖ రాస్తే అప్పుడు స్పందించలేదని గుర్తు చేశారు. స్వాతంత్ర్య సమరయోధుడు గౌతు లచ్చన్న కుటుంబంగా చెప్పుకుంటున్న యార్లగడ్డ శిరీషలో సంస్కారం లోపించిందని విమర్శించారు. అదేపనిగా పశువుల మంత్రి అంటూ సంస్కార హీనంగా మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. సంస్కారహీనంగా మాట్లాడే శిరీష పిచ్చపిచ్చ మాటలకు 106లో ఎక్కించి పశువైద్యం చేయాల్సి ఉంటుంది హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, జడ్‌పి వైస్‌చైర్‌పర్సన్ పాలిన శ్రీనివాస్, పిఎసిఎస్ ఛైర్మన్ దువ్వాడ మధుకేశవరావు, వైస్ ఎంపిపి వంక రాజు, ఎంపిటిసి ఉపేంద్ర, పోలీస్ హౌసింగ్ బోర్డు డైరెక్టర్ సూరాడ రాజేశ్వరి గురుప్రసాద్, సర్పంచ్‌లు దున్న బాలరాజు, కర్ని శ్రీను, అట్టాడ గోపి, ధర్మారావు, గూడ ఈశ్వరరావు పాల్గొన్నారు.

టిడిపి-జనసేన కూటమిదే విజయం

జనసేన జిల్లా అధ్యక్షులు చంద్రమోహన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

టిడిపి, జనసేన కూటమి విజయం సాధించడం ఖాయమని జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ అన్నారు. నగరంలోని సూర్యమహల్ థియేటర్ వెనుక కాలనీలో జనసేన పార్టీ జిల్లా కార్యాలయాన్ని శనివారం ప్రారంభించారు. అనంతరం పెదపాడు రోడ్డులోని జనసేన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. భారతదేశ రాజకీయాల్లోనే నూతన ఒరవడిని తెచ్చిన పవన్‌కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతున్నామన్నారు. వైసిపి ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలు విసిగిపోయారని అన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ బడ్జెట్ రాష్ట్రానికి ఈత కాయ ఇచ్చి... తాటికాయ లాక్కున్న మాదిరిగా ఉందన్నారు. ఇటీవల జనసేన పార్టీ అధిష్టానం ఓ చారిత్రక నిర్ణయం తీసుకుందని, జనసేన పార్టీలో వీర మహిళలకు, జన సైనికులకు ఎవరికైనా ప్రమాదాలు జరిగితే వారికి ఆర్థికసహాయాన్ని చేస్తున్నట్టు వివరించారు. అందులో భాగంగానే ఇటీవల ప్రమాదంలో గాయపడిన గార మండలం లింగాలవలసకు చెందిన కోండ్రు లక్ష్మీనారాయణ యాదవ్‌కు రూ.2.50 లక్షల చెక్కును అందజేశారు. సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్తలు పేడాడ రామ్మోహనరావు, గేదెల చైతన్య, ఎన్ని రాజు, నిమ్మల నిభ్రం, కణితి కిరణ్, దాసరి రాజు, కోరాడ సర్వేశ్వరరావు, డాక్టర్ దుర్గారావు, విశ్వక్ సేన్, ప్రవీణ్, భూపతి అర్జునరావు, పాత్రుని పాపారావు, గర్భాన సత్తిబాబు, బాడాన జనార్ధనరావు, పాండ్రంకి రాజేష్, కూరాకుల యాదవ్ పాల్గొన్నారు.

కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న చంద్రమోహన్

మరింత ఉత్సాహంతో విధులు

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

పదిహేను రోజుల పాటు నిర్వహించిన మొబలైజేషన్ కార్యక్రమంలో నేర్చుకున్న విషయాలను పరిగణనలోకి తీసుకుని మరింత ఉత్సాహంతో విధులు నిర్వర్తించాలని ఎస్‌పి జి.ఆర్.రాధిక సూచించారు. ఎచ్చెర్ల ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ మైదానంలో జిల్లా సాయుధ పోలీసు బలగాలకు నిర్వహించిన 'మొబిలైజేషన్' ముగింపు కార్యక్రమంలో శనివారం పాల్గొన్నారు. ముందుగా ఆర్మ్డ్ రిజర్వ్ సిబ్బంది ఎస్‌పికి గౌరవ వందనం సమర్పించారు. పర్యవేక్షణలో ప్లటూన్ల వారీగా పిటి డ్రిల్, లాటి డ్రిల్, వెపన్ డ్రిల్ నిర్వహించారు. సిబ్బంది డ్రిల్‌పై సంతృప్తి వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ శిక్షణా కాలంలో నేర్చుకున్న విషయాలను తమ రోజువారి విధుల్లో, శాంతిభద్రతల్లో కొత్తగా తలెత్తే సమస్యలపై ఉపయోగిస్తూ, అన్ని విధాలుగా సిబ్బంది అవగాహన కలిగి ఉండాలన్నారు. వచ్చే ఎన్నికల్లో మరింత సమర్థవంతంగా పనిచేసి, క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ, జిల్లా పోలీసుశాఖకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ఎఆర్ సిబ్బందికి ఏటా మొబలైజేషన్ కార్యక్రమం అనేది ఒక రిఫ్రెష్మెంట్ కోర్స్ లాంటిదని అన్నారు. మీదైనందిన విధుల్లో మెరుగుపర్చుకునేందుకు నైపుణ్యం, ఫిజికల్ ఫిట్‌నెస్‌ను మెరుగుపర్చుక్లోన్నారు. ఉద్యోగంలో చేరే ముందు శిక్షణలో నేర్చుకున్న తర్ఫీదు అంశాలను మరోసారి గుర్తు చేసుకుంటూ మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దుకునేందుకు ఈ మొబలైజేషన్ దోహదం చేస్తుందన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యంపై దృష్టి పెట్టాలన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌పి జి.ఆర్ రాధిక

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఈ నెల 11 నుంచి 15 వరకు మొదటి విడత, 16 నుంచి 20 వరకు రెండో విడత ఇంటర్మీడియట్ ఎంపిసి, బైపిసి విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తున్నామని ఆర్ఐఒ పి.దుర్గారావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాక్టికల్స్‌లో జనరల్ కింద ఎంపిసి, బైపిసి తరగతులకు, ఇతర ఒకేషనల్ కోర్సులకు 14,750 మంది అభ్యర్థులు పరీక్ష రాసేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. జనరల్ ప్రాక్టికల్స్, ఒకేషనల్స్ కోసం 113 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వాటిలో 32 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, పది మోడల్ స్కూళ్లు, మిగిలినవి ప్రయివేటు యాజమాన్య కళాశాలలు ఉన్నాయని తెలిపారు. ప్రతి కేంద్రంలోనూ సిసి కెమెరాలు ఉండేలా చూసుకోవాలని చీఫ్ సూపరింటెండెంట్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. విధుల్లో 210 మంది ఎగ్జామినర్లు, 113 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, డిఇసి కమిటీ డిడిఇఒ బృందం పర్యవేక్షిస్తుందని అన్నారు. ఎక్కడా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు పాటిస్తున్నామని తెలిపారు. అలాగే మార్చి 1 నుంచి థియరీ పబ్లిక్ పరీక్షలు ప్రారంభమవుతాయని అన్నారు.

మానవ అక్రమ రవాణాపై చర్యలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో మానవ అక్రమ రవాణాను, వెట్టిచాకిరిలను అరిట్టేందుకు కఠిన చర్యలు తప్పవని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా హెచ్చరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన న్యాయ సేవా సదన్‌లో శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలల సంరక్షణ, 18 ఏళ్ల వయసు వరకు పాఠశాలకు వెళ్లి చదువుకోవాలన్న ఆలోచనను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. చదువుకోవాల్సిన వయసులో పనిలోకి పంపడం, వారిని చేర్చుకోవడం నేరమని అన్నారు. జిల్లాలో ఎక్కువ శాతం పిల్లలు అర్ధాంతరంగా చదువును ఆపేసి పనుల్లో చేరుతున్నారన్నారు. అటువంటి వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. చట్టాలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు మాట్లాడుతూ మహిళల సంరక్షణపై, బాలల సంరక్షణపై ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ప్రొటెక్షన్ సిబ్బంది విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కె.వి.రమణ పాల్గొన్నారు.

పుస్తకాన్ని అందజేస్తున్న సన్యాసినాయుడు

గెలుపు ఊహల్లో 'తమ్ముళ్లు'

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

వైసిపి ప్రభుత్వ పనితీరు, ఓటర్లు ఏమనుకుంటున్నారు వంటి అంశాలపై ఇటీవల ఓ సర్వే సంస్థ చేపట్టిన వివరాల్లో టిడిపి వైపే మొగ్గు అంటూ వార్తలు రావడంతో తెలుగు తమ్ముళ్లు అప్పుడే గెలుపు ఊహల్లో తేలియాడుతున్నారు. ఏ నియోజకవర్గం నాయకుడిని కదిపినా మేమే గెలుస్తామని ఢంకా బజాయించి మరీ చెప్తున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న టెక్కలి, కింజరాపు కుటుంబం ఆశీస్సులు మెండుగా ఉన్న ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, పలాసలో గౌతు శిరీషతో పాటు ఆమదాలవలసకు ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న జిల్లా పార్టీ అధ్యక్షుడు కూన రవికుమార్ నియోజకవర్గాల్లో పార్టీపరంగా సాఫీగా ఉంది. శ్రీకాకుళం, పాతపట్నం, ఎచ్చెర్ల నరసన్నపేట నియోజకవర్గాల్లో మాత్రం ఇన్‌ఛార్జిలకు అసమ్మతి తలనొప్పిగా మారింది. నియోజకవర్గాల్లో ఆ రకమైన ఇబ్బందులకు కారణం పార్టీ పెద్దలేనన్న ఆగ్రహం ఉన్నా బయటకు కక్కలేక, మింగలేక సతమతమవుతున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలోనే ఆయా నియోజకవర్గాల్లో టిడిపి ఐవిఆర్ఎస్ సర్వే చేయాల్సి వచ్చిందన్న చర్చ నియోజవర్గ నాయకుల్లో సాగుతోంది. పార్టీ అధిష్టానం గత కొద్ది నెలలుగా ఐవిఆర్ఎస్ సర్వే ద్వారా గెలుపు అవకాశాలను పరిశీలిస్తోంది. జిల్లాలోని ప్రస్తుత ఇన్‌ఛార్జిలపై వ్యతిరేకత, నియోజకవర్గంలో టిక్కెట్ కోసం పోటీ పడుతున్న మూడు నాలుగు పేర్లు సూచించి అభ్యర్థి ఎంపికపై అడుగుతున్నారు. రెండోసారి రెండు, మూడు పేర్లు సూచించి నచ్చిన అభ్యర్థిని ఎంపిక చేయమని కోరుతున్నారు. చివరి సర్వేలో ఒకటో ఆప్షన్‌గా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరును, రెండో ఆప్షన్‌గా నోటాను సూచిస్తున్నారు. ఐవిఆర్ఎస్ సర్వే, క్షేత్రస్థాయి సర్వే తర్వాత అభ్యర్థులను ప్రకటించనున్నారనే ప్రచారం సాగుతోంది.

శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి సైతం సర్వేను ఎదుర్కోవాల్సి రావడం కొంత ఇబ్బందికరమైన పరిస్థితిగానే పార్టీ నాయకులు భావిస్తున్నారు. అదీ నియోజకవర్గంలో పెద్దగా పాపులారిటీ లేని గొండు శంకర్‌ను ఒక అభ్యర్థిగా సర్వేలో సూచించడంపై వారు జీర్ణించుకోలేకపోతున్నారు. 2019లో టిడిపి అధికారం కోల్పోయిన తర్వాత తీవ్ర మనస్తాపంతో ఏడాది వరకు ఏ నియోజకవర్గంలోనూ పార్టీ శ్రేణులు రోడ్డెక్కలేదు. ప్రభుత్వ వైఫల్యాలపై అధిష్టానం ఇచ్చిన పిలుపులకూ ఎవరూ స్పందించలేదు. చివరకు రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న టెక్కలిలో సైతం ఎవరూ ముందుకు రాలేదు. ఒక్క శ్రీకాకుళం నియోజకవర్గంలో మాత్రం గుండ లక్ష్మీదేవి, పార్టీ శ్రేణులతో పార్టీ నిర్ణయించిన నిరసన, ఆందోళన కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన కొన్ని కార్యక్రమాలకు మాత్రం టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అప్పుడప్పుడు హాజరయ్యారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు నాలుగున్నరేళ్ల తర్వాత నియోజకవర్గంలో పర్యటించినా గుండ లక్ష్మీదేవి పార్టీ అధికారం కోల్పోయిన నాటి నుంచి ఇప్పటివరకు నియోజకరవర్గంలోని అన్ని గ్రామాలను నిరంతరం కలియ తిరుగుతూనే ఉన్నారు. కష్టాల్లో ఉన్న కార్యకర్తల ఇళ్లకు వెళ్లి పరామర్శిస్తూనే ఉన్నారు. జనం మధ్య ఉన్న నాయకులకు అసమ్మతి ఏమిటి, అప్పుడప్పుడు నియోజకవర్గం మొఖం చూసి వెళ్లిపోయిన నేతలకు అంతా సమ్మతిగానే ఉండటం నియోజకవర్గ నాయకులకు మింగుడు పడటం లేదు.

పాతపట్నం, నరసన్నపేట, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో సర్వే సాగుతోంది. పాతపట్నంలో టిడిపి ఓటమి తర్వాత నియోజకవర్గ బాధ్యతలను పార్టీ అధిష్టానం కలమటకు అప్పగించింది. అక్కడ ఇన్‌ఛార్జికి ఇబ్బంది పెట్టేలా టిడిపి నాయకుడు మామిడి గోవిందరావు పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చారు. కలమటను వ్యతిరేకించే కొంతమంది నాయకులు గోవిందరావు పక్షాన చేరారు. నరసన్నపేటలో ఇప్పటివరకు మాజీ ఎమ్మెల్యే బగ్గు లక్ష్మణరావుకే టిక్కెట్ వస్తుందని అంతా అనుకుంటున్న తరుణంలో పార్టీ పెద్దలు అక్కడ కొత్తగా మారో పేరును తెరపైకి తీసుకొచ్చారన్న చర్చ నడుస్తోంది. మాజీ ఎమ్మెల్యే బగ్గు లక్ష్మణరావు తనయుడు, వైద్యులు బగ్గు శ్రీనివాసరావు కూడా టిక్కెట్ కోసం ప్రయత్నిస్తున్నారన్న వార్తలతో అక్కడి టిడిపిలో ఇబ్బంది మొదలైంది. ఎచ్చెర్లలో పార్టీ సీనియర్ నేత కళా వెంకటరావు నియోజవకర్గ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చూస్తున్నా... పార్టీ నాయకుడు కలిశెట్టి అప్పలనాయుడు పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్వల్పంగానైనా పార్టీ కేడర్ కొంత అటు వెళ్లింది. నాలుగు నియోజకవర్గాల్లోనూ టిక్కెట్ ఆశించో లేక పార్టీ పెద్దల ప్రోత్సాహంతో గ్రూపులు నిర్వహించో ఆశలు పెట్టుకున్న నాయకులు పార్టీ సూచించిన అభ్యర్థుల గెలుపునకు ఎంత వరకు సహకరిస్తారన్నది అనుమానంగానే ఉంది. ఇప్పటివరకు తమకే టిక్కెట్ అంటూ ప్రచారం చేసుకుంటూ, సొంత పార్టీ నేతలపై కత్తులు దూసిన అసమ్మతి నాయకులు, అధిష్టానం ప్రకటించిన అభ్యర్థులతో మునుపటిలా కలుస్తారా? అన్నది సందేహంగానే కనిపిస్తోంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో టిడిపి జెండా ఎగురవేస్తామని, మళ్లీ చంద్రబాబును ముఖ్యమంత్రిని చేస్తామని రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు బయటకు చెప్పి, వేరే అజెండా అమలు చేస్తే మాత్రం జిల్లాలో పార్టీ నష్టపోయే ప్రమాదముంది. రాష్ట్రమంతా తిరిగి పార్టీ తగవులను తీరుస్తున్న అధ్యక్షుల వారు జిల్లాకు వచ్చే సరికి ఎందుకు చొరవ చూపడం లేదోనన్న సందేహాలు అందరిలోనూ రేకెత్తుతున్నాయి. జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో నెలకొన్న అసమ్మతిని చల్లార్చకుండా, గ్రూపుల పోరుకు చెక్ చెప్పకుండా అన్నింటిలో గెలుస్తామని భావించడం భ్రమే అవుతుంది.

GOVERNMENT OF ANDHRA PRADESH
ENDOWMENTS DEPARTMENT
E-PROCURMENT TENDER NOTICE:
Improvements to Sri Anandeswara Swamy Temple, Byripuram(V), Kaviti (M), Srikakulam District.
NIT NO.P/COE/1641/2023 Dt.30.12.2023
For further details log onto **website https://tender.apeprocurment.gov.in**
For further details contact **Ph. 9493909444**
EXECUTIVE AUTHORITY
Sri Anandeswara Swamy Temple,
Byripuram (V),Kaviti (M), Srikakulam District.

కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

ఎమ్మెల్సీ విస్తృత పర్యటన

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ టెక్కలి పంచాయతీలో శనివారం విస్తృత పర్యటన చేపట్టారు. ఎంపిటిసి-1, వార్డుసభ్యులు సువ్వారి రాజేశ్వరరావు, దివ్వెల పోలయ్య, వైసిపి నాయకులు, కార్యకర్తలు, కలిసి ప్రజా సమస్యపై చర్చించి కార్యకర్తలకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో మండల నాయకులు చింతాడ గణపతి, జెసిఎస్ కన్వీనర్ కిలిపల్లి మోహన్, సర్పంచ్ గొండెలి సుజాత, ఎంపిటిసి పేత హేమలత, తమ్మన్నగారి కిరణ్, కిల్లి అజయ్ కుమార్, బమ్మిడి తులసీరావు, కూన సూర్యారావు కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐ ఇమాన్యుల్ రాజు

విద్యలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

విద్యలో రాణిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సిఐ ఇమాన్యుల్ రాజు అన్నారు. స్థానిక స్వర్ణ భారతి విద్యా సంస్థలో ఫేర్‌వెల్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణించి మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలని, తద్వారా తల్లి తండ్రులకు, గురువులకు, స్వర్ణభారతి విద్యా సంస్థకు మంచి పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమానికి విద్యా సంస్థల చైర్మెన్ చాటల తులసీదాస్ రెడ్డి అధ్యక్షత వహించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ సందీప్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉజ్వల్

నిరుత్సాహం వద్దు

నెహ్రూ యువకేంద్రం కో-ఆర్డినేటర్ ఉజ్వల్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఐఎఎస్‌కు ప్రయత్నిస్తున్న అభ్యర్థులు తప్పిపోతే నిరుత్సాహ పడొద్దని, ప్రిలిమ్స్‌కి మూడు సార్లు ప్రయత్నించాలని, పట్టువదలకుండా ప్రయత్నించినప్పుడే లక్ష్యానికి చేరుకోగలమని నెహ్రూ యువ కేంద్రం కో-ఆర్డినేటర్ కె.వి.ఉజ్వల్ అన్నారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ఏకం ఐఎఎస్ అకాడమీ అధ్యక్షతన శనివారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐఎఎస్‌కు ప్రిలిమ్స్‌కు, మెయిన్స్‌కు ఒకేసారి చదివితే అభ్యర్థులకు ప్రయోజనం ఉంటుందన్నారు. జీవితంలో అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని, లేకుంటే జీవితాంతం ఆలోటు భర్తీ సాధ్యం కాదని అన్నారు. చిత్తశుద్ధితో, క్రమశిక్షణతో ప్రయత్నిస్తే ఆలస్యమైనా దాని ఫలితం తప్పకుండా వచ్చి తీరుతుందన్నారు. ఏకం ఐఎఎస్ అకాడమీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ అకాడమీ ఆధ్వర్యాన ఢిల్లీ, హైదరాబాద్‌లలో బ్రాంచీలు నడుస్తున్నాయని వివరించారు. హైదరాబాద్‌లో ఏకం ఐఎఎస్ అకాడమీ స్థాపించి మూడేళ్లు పూర్తయిందని చెప్పారు. ఢిల్లీ తరహాలోనే ఇక్కడా రెగ్యులర్ ఫ్యాకల్టీ ఉన్నారన్నారు. ఏకం అంటే సబ్జెక్టుతో పాటు ఏకమై జర్నీలో మమేకం కావడమే అన్నారు.

తెలుగువారు గర్వించదగ్గ వ్యక్తి పి.వి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అత్యున్నత స్థాయి పురస్కారమైన భారత రత్న అవార్డును తెలుగువాడైన దేశ మాజీ ప్రధాని పి.వి.నరసింహారావుకు ఇవ్వడం గర్వించదగ్గ విషయమని పలువురు వక్తలు కొనియాడారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన భారత రత్న అవార్డు గ్రహీతలకు అభినందనలు తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాది వేసిన పివి మన తెలుగు వారు కావడం గర్వకారణమన్నారు. కాంగ్రెస్ పార్టీకి పూర్తి మెజారిటీ లేకపోయినా... మైనారిటీ ప్రభుత్వాన్ని ఐదేళ్లు పాటు నడిపిన అపర చాణక్యుడని కొనియాడారు. దేశ అత్యున్నత పురస్కారం ప్రకటించడం హర్షదాయకమన్నారు. కార్యక్రమంలో వాకర్సు ప్రతినిధులు గేదెల ఇందిరాప్రసాద్, శాసపు జోగినాయుడు, బి.వి.రవిశంకర్, బి.దేవీప్రసాద్, ఆనందరావు, గేదెల లక్ష్మి, రామ్‌బాయి, నాగేశ్వరరావు, బి.జగదీశ్వరరావు, డాక్టర్ జి.ఎన్.రావు పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందిస్తున్న గొండు శంకర్

రసవత్తరంగా హాకీ పోటీలు

శ్రీకాకుళం అర్బన్ : నగర శివారుల్లో ఉన్న పాత్రునివలస మినీ స్టేడియంలో రెండు రోజులుగా సాగుతున్న 14వ రాష్ట్రస్థాయి మహిళా ఛాంపియన్ షిప్ హాకీ పోటీలు శనివారం రసవత్తరంగా కొనసాగాయి. ఈ క్రీడాకారులను సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యఓఉలు గొండు శంకర్ అభినందించారు. క్రీడల్లో రాణించడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ వేదికలపై నుంచి కీర్తిని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో పాత్రునివలస మాజీ సర్పంచ్ పంచిరెడ్డి అప్పలనాయుడు, తెలుగు యువత కార్యదర్శి గొండు శ్యామ్‌సుందర్, టిడిపి నాయకులు పంచిరెడ్డి గురునాథ్, ఎండు చిన్నారావు, రామ్మోహనరావు, నాగేంద్రయాదవ్, రెడ్డిశంకర్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను సన్మానిస్తున్న హారికాప్రసాద్

కలెక్టర్‌ను కలిసిన హారికాప్రసాద్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ను లయన్ క్లబ్ ఆఫ్ హర్షవల్లి వ్యవస్థాపక అధ్యక్షులు కె.ఎన్.ఎస్.వి.ప్రసాద్ (హారికాప్రసాద్) మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కలెక్టరేట్‌లో ఛాంబరులో కలుసుకొని పుష్పగుచ్చం శనివారం అందజేసి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి ఆధ్వర్యాన చేపడుతున్న సేవా కార్యక్రమాలను కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో లయన్స్ క్లబ్ ఆఫ్ హర్షవల్లి ట్రెజరర్ తర్లాడ అప్పలనాయుడు, గ్రీన్ సిటీ అధ్యక్షులు మణిశర్మ, చేయూత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు వెంకటలక్ష్మి, లయన్స్ క్లబ్ హర్షవల్లి సభ్యులు లక్ష్మణరావు పాల్గొన్నారు.

గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలి

పలాస : సమావేశంలో మాట్లాడుతున్న మోహనరావు

ప్రజాశక్తి- పలాస

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా 16న దేశ వ్యాప్తంగా పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌కు సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. మందస సిఐటియు కార్యాలయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వ విధానాలతో ప్రజలు, రైతులు, కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్వామినాథన్ కమిషన్ నివేదిక ప్రకారం రైతాంగం పండించిన అన్నిరకాల పంటలకు మద్దతు ధరలు కల్పించాలని, కార్మిక వ్యతిరేఖ లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సవరణ బిల్లు 2020ను రద్దు చేయాలని, వ్యవసాయానికి సాగునీరు అందించాలని, పెరుగుతున్న ధరలు అదుపు చేయాలని కోరారు. ఆహార భద్రతా చట్టం పటిష్టంగా అమలు చేయాలని, వంశధార కాలువ బహుదా నదికి అనుసంధానం చేసి రైతులకు సాగునీరు అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జీడి పిక్కల 80 కేజీల బస్తాకు రూ.16వేలు మద్దతు ధర నిర్ణయించి ఆర్‌బికెలు ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అటవీహక్కుల చట్టం సవరణలు ఉపసంహరించాలని, ఆదివాసుల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు నాయకులు ఆర్.దిలీప్ కుమార్, పి.దేవేంద్ర, కె.శేఖరరావు, రైతు సంఘం నాయకులు ఎం.ధర్మారావు, హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్.వల్లభరావు, అప్పలస్వామి, రైస్ మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకులు, బి. దుర్యోధన సిహెచ్ అప్పన్న అప్పలస్వామి, ఆర్ ఏకాసి పాల్గొన్నారు.

కొబ్బరి బోర్డు ఏర్పాటు చేయాలి

ఉద్దానంలో విస్తారంగా సాగు చేస్తున్న జీడి, కొబ్బరికి బోర్డు ఏర్పాటు చేయాలని అఖిల భారత కిసాన్ మహాసభ జిల్లా కన్వీనర్ మద్దిల రామారావు డిమాండ్ చేశారు. పలాస కాశీబుగ్గ పట్టణంలో జగనన్న కాలనీలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ నెల 16న సమ్మె విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని ఆరోపించారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి, జిల్లా కమిటీ సభ్యులు పిన్నింటి నాగేశ్వరరావు, పోతనపల్లి బాలరాజు, పి.సింహాచలం, ఎల్. వెంకటమోహన్, దుర్గా ప్రసాద్, ఉపేంద్ర, సోమేష్, ఎం.దాసు, రవి, మార్పు కృష్ణారావు, భాస్కరరావు, లోకనాధం పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : ఉపాధి కార్మికులతో మాట్లాడుతున్న నాయకులు

వజ్రపుకొత్తూరు: ఈ నెల 16న జరిగే సమ్మె జయప్రదం చేయాలని కౌలు రైతుల సంఘం నాయకులు బి.ఆనందరావు, సిఐటియు నాయకులు ఎన్.మోహనరావు కోరారు. శనివారం కిడిసింగిలో ఉపాధిహామీ వేతనదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్.చంద్రయ్య, బి.రామకృష్ణ, ఎన్.బైరాగి, ఉపాధి కార్మికులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి: 16న నిర్వహించనున్న బంద్‌ను విజయవంతం చేయాలని ఆల్ ఇండియా కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షులు ముచ్చి బంగారయ్య అన్నారు. పర్లాకిమిడి సిపిఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా కిసాన్ మజ్దూర్ సభ జిల్లా కార్యదర్శి కేదార్ సబర్, గజపతి జిల్లా రైతు కూలీ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రొక్కం లోకనాథం, భారత్ కిసాన్ మజ్ దూర్ సంఘ్ జిల్లా కార్యదర్శి జగన్నాథం, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ముకుందరెడ్డి మృతి తీరని లోటు

కోటబొమ్మాళి : మండలం కొత్తపేటకు చెందిన మాజీ సర్పంచ్, సర్పంచ్ ప్రతినిధి, వైసిపి నాయకుడు రామపాత్రుని ముకుందరెడ్డి అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షుడు బాడాన మురళీ, మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజు, సచివాలయ కన్వీనర్ గడ్డవలస నాగభూషణరావు, కళింగ కర్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, వైసిపి నాయకులు అన్నెపు రామారావు, పేడాడ వెంకటరావు ఆయన కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈయన మృతి వైసిపికి తీరని లోటన్నారు.

అరసవల్లి సందర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని ఎపి చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేటర్ అండ్ రెవెన్యూ చీఫ్ సెక్రెటరీ జి.సాయిప్రసాద్ కుటుంబ సభ్యులతో శనివారం సందర్శించారు. వారికి ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతించారు. స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వామివారి శేషవస్త్రాలను కప్పారు. అనంతరం చిత్రపటాన్ని జెసి ఎం.నవీన్ అందజేశారు. వారితో ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య, తహశీల్దార్ బి.వి.రాణి, ఆలయ సీనియర్ అసిస్టెంట్ కష్ణమాచార్యులు ఉన్నారు.

నిధులు లేకుండా క్రీడలు ఎలా?

ప్రజాశక్తి- టెక్కలి

పాఠశాల స్థాయిలో నిర్వహించనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12, 13, 14 తేదీల్లో నిర్వహించనున్న జోనల్ స్థాయి క్రీడాపోటీల నిర్వహణ ఇబ్బందిగా మారుతుంది. రెండు నియోజకవర్గాలు కలిపి ఒకే చోట వేదిక ఏర్పాటు చేసి మూడు రోజుల పాటు సుమారు ఏడు క్రీడలు నిర్వహించాలి. ఇటీవల పాఠశాల, మండల, నియోజకవర్గ స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు ఈ జోనల్ మీట్‌లో పాల్గొననున్నారు. అయితే టెక్కలి, పాతపట్నం నియోజకవర్గాలకు మూడు రోజులపాటు జరగనున్న ఈ పోటీలకు 9 మండలాల నుంచి విద్యార్థులు హజరు కానున్నారు. ఈ జోనల్ స్థాయి పోటీలకు ప్రభుత్వం రూ.20 వేలు మంజూరు చేసింది. ఈ పోటీలకు వందకుపైగా పాఠశాలల నుంచి 200 మంది వరకు విద్యార్థులు, 60 మంది వ్యాయామ ఉపాధ్యాయులు హజరు కానున్నారు. వీరికి రెండు పూటలా భోజనాలు, విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలకు ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు సరిపోవు. ఈ నేపధ్యంలో జోనల్‌స్థాయి క్రీడలు నిర్వహణ వ్యాయామ ఉపాధ్యాయులకు, నిర్వాహకులకు ఇబ్బందిగా మారుతుంది. ప్రభుత్వం మంజూరు చేసే నిధులు చాలవని నిర్వాహకులు వాపోతున్నారు.

'శంఖారావం'ను విజయవంతం చేయాలి

లావేరు : శంఖారావం సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- నరసన్నపేట

జగన్ మోహన్ రెడ్డి, వైసిపి నాయకుల అరాచకాలకు వ్యతిరేకంగా టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పూరించిన నాధమే శంఖారావమని మాజీ ఎమ్మెల్యే బగ్గ రమణమూర్తి, నియోజకవర్గ పరిశీలకులు మహంతి చిన్నం నాయుడు అన్నారు. శనివారం టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. యువగళం పాదయాత్రలో లోకేష్ పర్యటించని నియోజకవర్గాల్లో శంఖారావం పేరుతో పర్యటించి జగన్ రెడ్డి ప్రభుత్వ దౌర్జన్యాలపై ప్రజలకు, కార్యకర్తలకు తెలియజేయనున్నారన్నారు. శంఖారావంతో కార్యకర్తలు లోకేష్ వైపు మరింత చేరువయ్యేలా చేస్తుందన్నారు. అధిక సంఖ్యలో ప్రజలు, కార్యకర్తలు పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

లావేరు : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి చేపట్టిన శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, ఎచ్చెర్ల మాజీ ఎఎంసి చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర పిలుపునిచ్చారు. 15న లావేరులో నిర్వహించనున్న సభా ప్రాంగణాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమం మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు ఆధ్వర్యంలో జరుగుతుందని, అధిక సంఖ్యలో ప్రజలు, పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సభా పోస్టర్‌ను ఆవిష్కరించారు కార్యక్రమంలో టిడిపి నాయకులు పిన్నింటి మధుబాబు, లంకలపల్లి జగన్, ఎల్. శ్రీను, గొర్లె శ్రీనువాసరావు, లంకలపల్లి బాబు, మహేష్, ఎల్.ఆనంద్, ఐ.రమణ, వెంకటరమణ ఉన్నారు.

నరసన్నపేట : మాట్లాడుతున్న రమణమూర్తి

ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు చేయాలి

ప్రజాశక్తి- పలాస

ఎపి ల్యాండ్ టైట్లింగ్ యాక్టు-2023 రద్దు చేయాలని ఎఐకెఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంకల మాధవరావు డిమాండ్ చేశారు. కాశీబుగ్గ బస్టాండ్ ఆవరణలో అఖిలభారత రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టంతో చిన్న, సన్నకారు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లితుందని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ యంత్రాంగంలో జరిగిన లోపాల వలన గతంలో సివిల్ కోర్టుకు వెళ్లి కోర్టు ద్వారా కొంత ఉపశమనం పొందేవారని, ప్రస్తుతం అవకాశం లేకుండా పోతుందన్నారు. జిఒ నెంబర్ 572 తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు మామిడి భీమారావు, కార్యదర్శి కూర్మారావు, ఐఎఫ్‌టియు జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి, పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి వినోద్, వంకల పాపయ్య పాల్గొన్నారు.

మండల అభివృద్ధి ఎక్కడ?

ప్రజాశక్తి- మందస

మండలాన్ని దత్తత తీసుకున్న టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ గత 6 ఏళ్లలో ఎన్ని సేవా కార్యక్రమాలు, ఎన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేశారో ఈ ప్రాంత ప్రజలకు తెలియజేసి ఉద్దానంలో అడుగుపెట్టాలని వైఎస్ఆర్ ఉద్యాన యూనివర్సిటీ బోర్డ్ మెంబర్ బత్తిని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. తిత్లీ తుపాను సమయంలో నష్టపోయిన కొబ్బరి, జీడి రైతులకు ఇస్తున్న పరిహారం సరిపోవడం లేదని అడిగితే అన్ని డబ్బులు ఎక్కడ ప్రశ్నించారన్నారు. 2018 అక్టోబర్ నుంచి 2019 జూన్ వరకు టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ కనీసం ఒక్క రూపాయి కూడా అభివృద్ధి నిధులు ఇవ్వలేకపోయారన్నారు. ఉద్దానంలో కిడ్నీ వ్యాధితో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు కనీసం హరిపురం టౌన్‌లో ఒక డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చెయ్యలేదని, ఇప్పుడు ఏ మొఖం పెట్టుకొని శంఖారావం అంటూ ఉద్దానంలో అడుగు పెడుతున్నారన్నారు.

ఇద్దరికి ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా పరిషత్ యాజమాన్యం పరిధిలో ఇద్దరు రికార్డు అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ చైర్‌పర్సన్ పిరియా విజయ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు గార మండలం శ్రీకూర్మం హైస్కూల్ రికార్డు అసిస్టెంట్‌గా ఉన్న వై.గణపతిరావును సీనియర్ సహాయకులుగా జిల్లా పరిషత్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఎచ్చెర్ల మండలం మెట్టవలస హైస్కూల్ రికార్డు అసిస్టెంటుగా ఉన్న కె.మురళీకృష్ణ పట్నాయక్‌ను పొందూరు మండలం తోలాపి హైస్కూల్ సీనియర్ సహాయకులుగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఈ మేరకు వారికి జెడ్‌పి సిఇఒ డి.వెంకటేశ్వరరావు, ఉపముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకట్రామన్, సి-సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి పత్రాన్ని అందజేస్తున్న విజయ

ఎపిఇపిడిసిఎల్‌కు రెండు జాతీయ అవార్డులు

ప్రజాశక్తి- విశాఖపట్నం

వినియోగదారులకు సేవలందించే క్రమంలో ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఇపిడిసిఎల్)కు రెండు జాతీయ స్థాయి అవార్డులు లభించాయి. ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఇప్పయ్) ఆధ్వర్యంలో కర్ణాటకలోని బెల్గాంలో శనివారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఈ మేరకు ఎపిఇపిడిసిఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి తరపున సంస్థ ఫైనాన్స్ డైరెక్టర్ డి.చంద్రం ఈ అవార్డులను అందుకున్నారు. ఇంధన రంగంలో విద్యుత్ పంపిణీ సంస్థల నష్టాలను తగ్గించేందుకు ఉద్దేశించబడిన సరికొత్త కృత్రిమ మేధ (ఎఐ), మెషిన్ లెర్నింగ్ టెక్నిక్ వంటి అంశాలపై చర్చించేందుకు బెల్గాంలోని శూన్య ఫార్మ్ రిట్రీట్‌లో ఇప్పయ్ ఆధ్వర్యంలో '24వ రెగ్యులేటరీ అండ్ పాలసీమేకర్స్ రిట్రీట్' పేరిట ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు సదస్సు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం జరిగిన ఇప్పయ్ పవర్ అవార్డ్స్-2024 ప్రదానోత్సవ కార్యక్రమంలో ఇంధన రంగంలో వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన సంస్థలకు అవార్డులు ప్రదానం చేశారు. సంస్థ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలందించడంలో ఉత్తమ పనితీరు కనబరిచినందుకు ఎపిఇపిడిసిఎల్ జాతీయ స్థాయిలో అవార్డును కైవసం చేసుకుంది. దీంతో పాటు వినియోగదారుల్లో అవగాహన పెంపుదల అంశంలోనూ అవార్డును సొంతం చేసుకుంది. రెండు జాతీయ అవార్డులు లభించడం పట్ల సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఇంధన శాఖల సహకారంతో ఇపిడిసిఎల్‌లో పలు రకాల పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. సంస్థ ఉద్యోగులు, సిబ్బంది అత్యుత్తమ పనితీరుకు నిదర్శనంగా సంస్థ జాతీయ అవార్డులను సొంతం చేసుకుందని తెలిపారు. ఇదే స్ఫూర్తితో వినియోగదారులకు మరిన్ని నాణ్యమైన సేవలందిస్తామన్నారు. మారుమూల ప్రాంతాల్లో ఉన్నవారికి సైతం విద్యుత్ సౌకర్యం కల్పిస్తూ, సంస్థను అభివృద్ధి పథంలో పయనింపజేసేందుకు కృషి చేస్తామని తెలియచేశారు. ఈ సందర్భంగా అధికారులకు, సిబ్బందికి ఆయన అభినందనలు తెలియజేశారు.

నిందితులను శిక్షించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని ఎచ్చెర్ల మండలం ట్రిబుల్ ఐటి సమీపాన శుక్రవారం ఎచ్చెర్ల మండల ఉపాధ్యక్షులు జరుగుల్ల శంకర్‌పై దాడికి పాల్పడ్డ వ్యక్తులను తక్షణమే అరెస్టు చేసి వారిని కఠినంగా శిక్షించయాలని జిల్లా వెలమ సంక్షేమ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని పెద్దపాడులో ఉన్న వెలమ సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శంకర్‌పై జరిగిన దాడి కుటుంబ సభ్యులకు, సామాజిక తరగతి ప్రజలకు, ఆయన సన్నిహితులకు తీవ్ర మనోవేదనకు గురి చేసిందని అన్నారు. అతన్ని నేరుగా ప్రజా క్షేత్రంలో ఎదుర్కొనే ధైర్యం లేని కొంతమంది దుండగులు కుట్రపూరితంగా మారణాయుధాలతో దాడి చేయడం పిరికిపంద చర్య అని పేర్కొన్నారు. తక్షణమే పోలీస్ యంత్రాంగం స్పందించి ఈ దుశ్చర్యకు పాల్పడిన దోషులను శిక్షించాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసు యంత్రాంగం చూడాలన్నారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు అంబటి రంగారావు, నక్క రామరాజు, బట్న కృష్ణమూర్తి, బగ్గు అసిరినాయుడు, వెలమల ఇంద్రసేనారావు, చీడి రాంబాబు, రుప్ప కృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెలమ సంఘ నాయకులు

నందిగాం : పరామర్శిస్తున్న అచ్చెన్నాయుడు

రమణయ్య కుటుంబానికి పరామర్శ

నందిగాం: విశాఖపట్నంలో ఇటీవల హత్యకు గురైన తహశీల్దార్ సనపల రమణయ్య కుటుంబాన్ని రాష్ట్ర టిడిపి అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు శనివారం పరామర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈయన వెంట టిడిపి నాయకులు ఎ.రవి ప్రసాద్, పి.అజయ్ కుమార్, బాలకృష్ణ, వైకుంఠరావు ఉన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ....

తహశీల్దార్ రమణయ్య కుటుంబాన్ని ఎమ్మెల్సీ, టెక్కలి వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ శ్రీనివాస్ పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈయన వెంట నాయకులు ఎర్ర చక్రవర్తి, అట్టాడ శ్రీనివాసరావు, జె.జయరామ్, పోలాకి మోహనరావు ఉన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పేదలకు తనవంతు సాయం అందించాలన్న లక్ష్యంతో డాడీ హెల్పింగ్ ఫౌండేషన్ పనిచేస్తోందని అధ్యక్షులు ప్రభాస్‌సూర్య తెలిపారు. శాంతినగర్ కాలనీలోని అంబేద్కర్ మందిరంలో ఫౌండేషన్ ఆధ్వర్యాన వృద్ధులకు బియ్యం, నిత్యాసర వస్తువులను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా సూర్య మాట్లాడుతూ బిజిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బరాటం చక్రవర్తి, యోగానందం, పీపుల్ సేవ్ వెల్ఫేర్ సొసైటీ ఫౌండర్ పిడుగు నరేష్ భాగస్వామ్యంతో ఈ నెల నిత్యావసర సరుకులను వృద్ధులకు అందించినట్లు చెప్పారు. ప్రసాద్, నాగేంద్ర, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులను 108లో ఎక్కిస్తున్న సోంపేట జెడ్‌పిటిసి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- పలాస

పలాస కోసంగిపురం జాతీయ రహదారిపై ట్రాక్టర్, బైక్ ఢీకొనడంతో మందస మండలం కొండలోగాంకు చెందిన సవర దివాకర్, సవర వెన్నెలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో అదేరూట్‌లో ప్రయాణిస్తున్న సోంపేట జెడ్‌పిటిసి తడక యశోద, పలాసపురం సర్పంచ్ తడక జోగారావు సంఘటన స్థలానికి చేరుకొని సపర్యలు చర్యలు చేపట్టి 108కు సమాచారం అందించి ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా మానవతా దృక్పథంతో చేసిన సేవలను ఘటనా స్థలంలో ఉన్న పలువురు అభినందించారు.

విరిగిన గేటును పరిశీలిస్తున్న రైల్వే సిబ్బంది

రైల్వే గేటును ఢీకొన్న ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ రైల్వే గేటును శనివారం ఆర్‌టిసి బస్సు ఢీకొనడంతో పాక్షికంగా దెబ్బతింది. దీంతో సుమారు గంట పాటు వాహనాల రాకపోకలు స్తంభించాయి. విశాఖపట్నం నుంచి వస్తున్న రైలుకు గేటు వేశారు. రైలుస్టేషన్ దాటిన వెంటనే గేటు కీపర్ రైల్వే గేటును ఎత్తుతుండగా శ్రీకాకుళం నుంచి పలాస వస్తున్న ఆర్‌టిసి బస్సు వేగంగా వచ్చి ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ సంఘటనపై పలాస ఆర్‌పిఎఫ్ పోలీసులు ఆర్‌టిసి డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థితో మాట్లాడుతున్న ఎంఇఒ పద్మనాభం

పాఠశాలల తనిఖీ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో ఆంపురం, పెంగువాడ పాఠశాలలను ఎంఇఒ మల్లారెడ్డి పద్మనాభం శనివారం తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధిని, పాఠశాలల పరిశుభ్రతను, రికార్డులను పరిశీలించారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి తగు సూచనలు చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జయరాం, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘటాలతో ఊరేగింపుగా వెళ్తున్న యాత్రికులు

కన్నేవలసలో అన్నదానం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలం కన్నేవలసలో శ్రీ కొత్తమ్మతల్లి దేవాలయ ద్వితీయ వార్షికోత్సవం శనివారం ఆలయ దర్మకర్త, మాజీ సర్పంచ్ కాళ్ల గణపతిరావు గ్రామస్తులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు త్రినాధపండా, సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 5వేల మందికి మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

చిగురువలసలో భవిష్యత్‌కు గ్యారెంటీ

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలం చిగురువలసలో మండల తెలుగు యువత నాయకుడు వాస్తవ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనను ప్రజలకు వివరించారు. అనంతరం పోస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు వాన నరేష్, బాన్న రమేష్, అలుగు రమణ, రాజు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు

కవిటి: కవిటిలో నూతనంగా నిర్మిస్తున్న వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి పలువురు దాతలు ఉదారంగా విరాళాలు అందిస్తున్నారు. సొన్నాపురం గ్రామానికి చెందిన గంతి కుమార్ రూ.5వేలు, కవిటి గ్రామానికి చెందిన మొగిలిపురి కృష్ణారావు రూ.10 వేలు, కవిటిలో స్వీట్ షాపు నిర్వహిస్తున్న బావన రవి దంపతులు రూ.5వేలు, చిన్నకర్రివానిపాలెం గ్రామానికి చెందిన దీనబందు రూ.5వేలు, ధవళ కమల లోచన బెహరా రూ.6వేలు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీసభ్యులు మొగిలిపురి సీతాలు, బచ్చు పాపయ్య రెడ్డి మాట్లాడుతూ ఆలయ నిర్మాణపనులు శరవేగంగా జరుగుతున్నాయని, సామాన్యుల నుంచి ప్రముఖుల వరకూ అందరూ తమకు తోచిన సాయం చేస్తున్నారని తెలిపారు. దాతలు మరింత సహకారం అందిస్తే తొందర్లోనే ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

'108' తనిఖీ

పలాస: 108 సేవలు అందించడంలో నిర్లక్ష్యం వద్దని డివిజనల్ ఆపరేషన్ అధికారి గండేపల్లి జగన్నాథరావు అన్నారు. మండల కేంద్రంలో 108 సేవలను శనివారం పరిశీలించారు. వాహన నిర్వహణ తీరు, పరికరాల పనితీరుతో పాటు అత్యవసర మందులు, రికార్డుల నిర్వహణ, డ్యూటీ ఛార్ట్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మెరుగైన సేవలు అందించాలని, అత్యవసర సమయంలో మరింత బాధ్యతగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో 108 సిబ్బంది తారకేశ్వరరావు, పి.సత్యం, ఎన్. వెంకటరావు, శ్రీనివాసరావు, రామచంద్రరావు పాల్గొన్నారు.

108 వాహనంలో తనిఖీ చేస్తున్న జగన్నాథరావు